రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అంజిత్ కుమార్(ఫైల్)

కాసిపేట(తాండూర్), జనవరి 17 : తాండూర్ మండలంలోని రేపల్లెవాడ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పెగడపల్లికి చెందిన కందుగుల అంజిత్ కుమార్(18) అక్కడికక్కడే మృతి చెందినట్లు తాండూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు. పెగడపల్లికి చెందిన కందుగుల అంజిత్ కుమార్(18) రేపల్లెవాడ నుంచి ఐబీ తాండూర్‌కు వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఐచర్ వ్యాన్ కింద అంజిత్‌కుమార్ పడడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి బాపురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

బెల్లంపల్లిరూరల్, జనవరి 17: బెల్లంపల్లి పట్టణంలోని నంబర్ 2 ఇంక్లైన్‌బస్తీకి చెందిన గడిపల్లి రాకేశ్ (36) బుధవారం ఉదయం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాకేశ్ కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తున్నది. ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెల్లంపల్లి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని..

హాజీపూర్, జనవరి 17 : కళాశాలకు ఎందుకు వెళ్లడం లేదని తండ్రి మందలించినందుకు కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన హాజీపూర్ మండలంలో జరిగింది. ఎస్ఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నంనూర్ పునరావాసకాలనీకి చెందిన ఉప్పులేటి సుధాకర్ కుమారుడు, కూతురు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతూ మానేశాడు. కళాశాలకు ఎందుకు వెళ్లడం లేదని తండ్రి మందలించినందుకు మనస్తాపంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

• పొంచి ఉన్న ప్రమాదం..!

రోడ్డుకు ఇరువైపులా సైడ్ వాల్స్ లేకుండా ప్రమాదకరంగా వంతెన

లక్షెట్టిపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చి సమీపంలోని కెనాల్‌పై ఏర్పాటు చేసిన వంతెన సైడ్‌వాల్స్ ఇటీవల కూలిపోయాయి. రెండు నెలలైనా బ్రిడ్జిని ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో ఈ దారిలో కొత్తవాళ్లు వచ్చినా, వాహనాలు అదుపు తప్పినా కాలువలో పడితే ప్రాణాలో పోయే ప్రమాదముందని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిపై సైడ్‌వాల్స్ నిర్మించాలని కోరుతున్నారు.

-లక్షెట్టిపేట, జనవరి 17

బస్టాండ్ కిటకిట..

ప్రయాణికులతో రద్దీగా మారిన మంచిర్యాల బస్టాండు

సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత ప్రజలు బంధువుల ఇండ్ల నుంచి స్వగృహాలకు, మరోవైపు విద్యా సంస్థలకు వెళ్లేందుకు విద్యార్థులు రావడంతో మంచిర్యాల టీఎస్ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసింది. బస్సులు వచ్చేందుకు సైతం చాలా ఇబ్బందిగా మారింది. బస్టాండు నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు ట్రాఫిక్ జాం అయింది. బస్సులన్నీ ప్రయాణికులతో రద్దీగా మారాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ దృశ్యాలను 'నమస్తే' క్లిక్ మనిపించింది.

-మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనవరి 17

అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో భాగస్వాములవ్వాలి

• జైపూర్ ఎంపీపీ గోదారి రమాదేవి

జైపూర్ ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

వేమనపల్లి : బుయ్యారంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, ఎంపీవో

జైపూర్, జనవరి 17: స్థానిక సంస్థల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీపీ గోదారి రమాదేవి అన్నారు. బుధవారం జైపూర్ మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన 2024-25 సంవత్సరానికి సంబంధించి స్థానిక సంస్థలు (మండల, గ్రామపంచాయతీలు) అభివృద్ధి ప్రణాళికలు (బీపీ డీపీ, జీపీ డీపీ) అవగాహన సదస్సు సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను నిర్దేశించిన గడువులో గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అనిల్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, జనవరి 17 : కోటపల్లి మండలం రాజారాంలో గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై గ్రామసభను నిర్వహించారు. గ్రామ పంచాయతీలో చేపట్టబోయే పనుల వివరాలపై ప్రణాళిక తయారు చేసినట్లు సర్పంచ్ కొంక పోషక్క కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజ్మీరా రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లిలో..

వేమనపల్లి, జనవరి 17 : మండలంలోని బుయ్యారం, జిల్లెడ, సూరారం గ్రామాల్లో బుధవారం సర్పంచ్‌లు గోగర్ల శ్రీనివాస్, చీర్ల కొండల్‌రెడ్డి, పల్లె రమేశ్‌గౌడ్ అధ్యక్షతన గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీల స్థాయిలో ఆర్థిక, సామాజిక అత్యవసర సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో స్థానిక వనరులను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ఎంపీడీవో లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు నిర్దేశించిన గడువులోగా ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏవో వీరయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, కార్యదర్శులు చంద్రమౌళి, హరినాథ్, వెంకటేశ్, సర్పంచులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లిరూరల్, జనవరి 17: బెల్లంపల్లి మండలంలోని మాలగురిజాల, పాతబెల్లంపల్లి, సోమగూడెం గ్రామపంచాయతీల్లో బుధవారం ఎంపీడీవో డీ రాజేందర్ అధ్యక్షతన అధికారులు 2024-25 వ సంవత్సరం చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి యాక్షన్ ప్లాన్ ప్రణాళికలను సిద్ధం చేసేందుకు గ్రామ సభలను నిర్వహించారు. ఈ గ్రామసభల్లో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు హాజరై గ్రామపంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను ప్రజల సమక్షంలో వివరించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలు చేశారు. గ్రామసభల్లో సర్పంచులు అశోక్, రాయలింగు, ప్రమీలాగౌడ్‌తో పాటు ప్రభుత్వ అధికారులు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేటలో..

కాసిపేట, జనవరి 17 : సోమగూడెం భరత్ కాలనీ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్ అధ్యక్షతన గ్రామ అభివృద్ధి ప్రణాళిక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించారు. దీంతో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామ అభివృద్ధి ప్రణాళిక గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలాగౌడ్, ఎంపీటీసీ చుంచు మల్లమ్మ, వార్డు సభ్యులు జాడి ప్రమీలా, శైలజ, సల్మా, బత్తుల విజయ, రమా, రాధా, పెసరి రాజేశం, చిప్పకుర్తి తిరుపతి, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి రాజలింగు, ఏఈపీఆర్ విష్ణుకుమార్, ఏపీవో ఎస్తర్, ఏఈవో శ్రీనివాస్, సీసీ రామకృష్ణ, టీఏ భార్గవ్, పిండి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బెల్లంపల్లి, జనవరి 17: 23 వ వార్డు మాజీ కౌన్సిలర్ తోడే వంశీ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరామర్శించారు. వంశీ ఇటీవల కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందగా బుధవారం వారి ఇంటికి వెళ్లి చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. తల్లి పద్మారెడ్డిని పరామర్శించి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు నాయకులు మునిమంద రమేశ్, రుద్రభట్ల సంతోష్, సాబిర్ అలీ తదితరులు ఉన్నారు.

తపస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా శ్రీనివాస్

కన్నెపల్లి, జనవరి 17 : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) మంచిర్యాల జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా మోకెనపల్లి శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు తెలిపారు. కన్నెపల్లి మండలంలోని కుర్మగూడెం ప్రాథమిక పాఠశాలలో శ్రీనివాస్ పని చేస్తున్నాడు.

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

మంచిర్యాల అర్బన్, జనవరి 17 : ఈ నెల 20న జరగనున్న జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రవేశ పరీక్షకు మొత్తం 1188 మంది విద్యార్థులు హాజరు కానుండగా, జిల్లా కేంద్రంతో పాటు లక్షెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లిలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ , సెంటర్ లెవెల్ అబ్జర్వర్లకు నిర్వహించిన సమావేశంలో పరీక్షల నిర్వహణ పై డీఈవో సూచనలు చేశారు. ఈ సమావేశములో జవహర్ నవోదయ విద్యాసమితి ప్రిన్సిపాల్ చక్రపాణి జిల్లా ఏసీజీఈ దామోదర్ రావు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, సెంటర్ లెవెల్ అబ్జర్వర్లు పాల్గొన్నారు.

గిరిజనేతరుల లారీ ట్రాన్స్‌పోర్ట్‌లను రద్దు చేయాలి

కాసిపేట, జనవరి 17 : కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో గిరిజనేతరుల లారీ ట్రాన్స్‌పోర్టులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేవాపూర్ పంచాయతీ కార్యదర్శి కవితకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఏజన్సీ గ్రామమైన దేవాపూర్‌లో గిరిజనేతరులకు లారీ ట్రాన్స్‌పోర్టులకు అనుమతులు ఎలా ఇచ్చారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ఉపాధ్యక్షుడు కనక గోవర్ధన్, సిడం శంకర్, నాయకులు సిడం రాందాస్, కేశవరావ్, గడ్డం భీమయ్య, రొడ్డ రామ్మోహన్, కుంరం జగ్గారావ్, కలవేణి శ్రావణ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కాసిపేట, జనవరి 17 : కాసిపేట మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీ శివారులోని నర్సింగరావు చెరువు సమీపంలో ఉన్న గుట్టలను తవ్వి అక్రమంగా ట్రాక్టర్లలో బండను తరలిస్తున్నారని, అక్రమంగా బండ రాయిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో కాసిపేట తహసీల్దార్ భోజన్నకు బుధవారం వినతి పత్రం అందించారు.స్పందించిన తహసీల్దార్ వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంఆర్ఐకు సూచించారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

హాజీపూర్, జనవరి 17 : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి హాజీపూర్ మండల కమిటీని బుధవారం మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎన్నుకున్నట్లు జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ మాదిగ తెలిపారు. మండల అధ్యక్షులుగా ఎల్కటూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మల్యాల తిరుపతి, ప్రచార కార్యదర్శిగా అడ్లూరి వంశీ, కోశాధికారిగా మల్యాల నర్సయ్య, మండల కో-కన్వీనర్‌గా తాళ్లపెల్లి అంజి, గౌరవ అధ్యక్షుడిగా సీపెల్లి మొగిళిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎస్సీల వర్గీకరణ జరిగితేనే మాదిగలకు, మాదిగల ఉప కులాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఢిల్లీలో ఏడుగురు జడ్జిలతో మాదిగలకు అనుకూలంగా తీర్పు రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. తీర్పు వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

హాజీపూర్, జనవరి 17 : ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులైన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ అన్నారు. రెండు రోజుల పాటు పోలింగ్ బూత్‌లలో బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటు నమోదుతో పాటు మార్పులు చేర్పులను చేసుకోవచ్చన్నారు.

19 నుంచి రాష్ట్ర స్థాయి క్యారమ్ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి, జనవరి 17: తెలంగాణ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో రాష్ట్ర స్థాయి క్యారమ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శి రాచకట్ల బాలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి తనుగుల రాజన్న తెలిపారు. అండర్-12, అండర్-14, అండర్-18, అండర్-21 విభాగాల్లో బాలబాలికలకు పోటీలుంటాయని పేర్కొన్నారు. తమ ఎంట్రీలను ఈ నెల 18వ తేదీలోగా పంపించాలని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఫిబ్రవరిలో తమిళనాడులోని మధురైలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440010404కు సంప్రదించాలని సూచించారు.

20న ఉచిత శిక్షణ

బెల్లంపల్లి, జనవరి 17: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు టీవీ రచయితల సంఘం సంయుక్తంగా మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఔత్సాహిక సినీ, టీవీ రచయితల ఉచిత శిక్షణ శిబిరాన్ని ఈ నెల 20న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సమాఖ్య చీఫ్ కో ఆర్డినేటర్ హన్మాండ్ల మధుకర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సాంస్కృతిక సమాఖ్య పూర్వ ప్రధాన కార్యదర్శి, శిక్షణ శిబిరం చీఫ్ కో ఆర్డినేటర్ అభినవ సంతోష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రముఖ సినీ, టీవీ దర్శకులు నాగాబాల సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిబిరంలో ప్రముఖ సినీ దర్శకులు ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8074771108, 99082 32303 సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నృత్య కళా సమాఖ్య అధ్యక్షుడు రాకం సంతోష్, సినీ,టీవీ కొరియోగ్రాఫర్ పంబాల మల్లేశ్, జానపద కళాకారుల సంఘం బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు జంజిరాల దినేశ్‌కుమార్, సీనియర్ కళాకారులు బొంకూరి రాంచందర్, మిట్టపల్లి మల్లేశ్, బొప్పనపెల్లి రాజేశ్, బోంకూరి రవికుమార్, పంబాల రంజిత్, అభినాశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్, జనవరి 17: మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో ఈ నెల 18న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ మంచిర్యాల ఏడీఈ రేగుంట స్వామి తెలిపారు. ఐబీ చౌరస్తా నుంచి పాత మంచిర్యాల రాళ్లవాగు బ్రిడ్జి వరకు రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా స్తంభాల మార్పిడి, కొత్త లైన్ల ఏర్పాట్లు, తదితర కారణాల రీత్యా ఈ కరెంటు కోత విధిస్తామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. రాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోకి రాంనగర్, కాలేజ్‌రోడ్, ఎడ్లవాడ, మేదరివాడ, పద్మశాలీకాలనీ, చింతపండువాడ, రెడ్డికాలనీ, ముఖరాంచౌరస్తా ఏరియాలు వస్తాయని తెలిపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

చెన్నూర్ : క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి

చెన్నూర్, జనవరి 17: చెన్నూర్ లో మాజీ ఎమ్మెల్సీ సుల్తాన్ అహ్మద్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ పోటీలను జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి బుధవారం ప్రారంభించారు. పట్టణంలో మూడు రోజుల పాటు 12 జట్లు పాల్గొననున్నాయి. ఫైనల్ పోటీలో విజేతలుగా నిలిచిన జట్లకు షీల్డ్‌లతో పాటు బహుమతులను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

తాళ్లపేటలో ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

దండేపల్లి, జనవరి17: దండేపల్లి మండలంలోని తాళ్లపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో కంది నరేశ్-సందెల శశాంక్ స్మారకార్థం నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు ముగిశాయి. జన్నారం, దండేపల్లి మండలాలకు చెందిన 18 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. తాళ్లపేట జట్టు 2-1 తేడాతో రాజుగూడపై విజయం సాధించింది. తాళ్లపేట జట్టుకు రూ.5వేలు, రాజుగూడ జట్టుకు రూ.2500లతో పాటు ట్రోఫీలు, షీల్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కంది సతీశ్‌కుమార్, అడాయి కాంతారావు, ముస్తాఫా, కన్నాక జంగు, మర్రిపెల్లి సత్తయ్య, సందెల శ్రీధర్, సాదిక్, ఆర్గనైజర్ బోడకుంట మహేశ్(పులి), సందెల వంశీ, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి : విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

నేడు అభివృద్ధి పనులపై సమీక్ష

బెల్లంపల్లి, జనవరి 17: బెల్లంపల్లి నియోజవర్గంలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ శాఖల అధికారులతో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై 18 ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎమ్మెల్యే సూచించారు.

వాహనాలకు రేడియం స్టిక్కర్లు..


జాతీయ రహదారిపై వాహనాలకు రేడియం స్టిక్కర్ అతికిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మందమర్రి సమీప 363 నేషనల్ హైవే టోల్ ప్లాజా వద్ద బుధ వారం మంచిర్యాల ట్రాఫిక్ సీఐ నరేశ్ కుమార్, మందమర్రి ఎస్ఐ గంగాధర్, టోల్ ప్లాజా సిబ్బంది వాహనదారులకు సేఫ్టీపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం, సీటు బెల్ట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలపై వివరించడంతో పాటు రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేలా రేడియం స్టిక్కర్లను అతికించారు. పోలీసులతోపాటు టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొని వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యాలను 'నమస్తే' కెమెరాలో బంధించింది.

-మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనవరి 17

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల అర్బన్, జనవరి 17 : 2024-25 విద్యా సంవత్సరానికి మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి(బాలికలు), చెన్నూర్(బాలురు) మైనార్టీ పాఠశాలల్లో ఐదవ తరగతిలో అడ్మిషన్లు, 6, 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీలోగా ఆన్‌లైన్(http:/tmreistelangana. cgg.gov.in)లో దరఖాస్తు చేసుకోవాలని, ఆసక్తి కలిగి అర్హత ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వచ్చేనెల ఐఆర్‌సీఎస్ సమావేశం

మంచిర్యాల ఏసీసీ, జనవరి 17 : మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశం కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చేనెల ఫిబ్రవరి 18న కలెక్టరేట్‌లోని హాలులో నిర్వహించనున్నట్లు జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ దవాఖానలో రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నమోదైన శాశ్వత సభ్యత్వం పొందిన వారం తా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాగి అనిల్ కుమార్, వైస్ చైర్మన్ చందూరి మహేందర్, స్టేట్ కమిటీ సభ్యులు రాధాకృష్ణ, కోశాధికారి పడా ల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, సత్యపాల్ రెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బెల్లంపల్లి, జనవరి 17: పట్టణంలోని 31వ వార్డు, మహ్మద్ ఖాసీం బస్తీ, హనుమాన్‌మందిర్‌లో సీనియర్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు ఆధ్వర్యంలో సీఎస్‌సీ ప్లస్ హెల్త్ కేర్ సంస్థ సహకారంతో బుధవారం ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ భుజరంగరావు హాజరై ప్రారంభించారు. 20 రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలోమున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శంకర్‌సింగ్, సీనియర్ నాయకులు రామనుజ్‌సోని, గెల్లి రమాకాంత్, బండారి ప్రవీణ్ కుమార్, శ్యామ్‌బాబు, ఐకేపీ సిబ్బంది దుర్గయ్య, వనజ జైన్, పెండ్యాల లక్ష్మి, ఆశకార్యకర్త కాసం రేణుక పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముని పాదుకలకు పూజలు

పాదుకలకు పూజలు చేస్తున్న అర్చకులు

దండేపల్లి, జనవరి17: దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం అయోధ్య శ్రీరాముని పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. పాదుకలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు, వేదపారాయణదారు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. వెల్గనూర్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండారి మల్లేశ్ సర్పంచ్ శంకరయ్య, ఉపసర్పంచ్ కాంద్రపు లక్ష్మణ్, ఎంపీటీసీ చుంచు మల్లవ్వ, లక్ష్మీనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, తదితరులున్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, జనవరి 17 : మండలంలోని నాగంపేటలో అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ భక్తులు మహేశ్ ప్రసాద్, కామెర సంపత్, పుట్ట పున్నం, అన్నల సంతోష్, పత్తి మధునయ్య, పుట్ట రమేశ్, జెల్ల వెంకటస్వామి, విశాల్ తివారి గ్రామస్తులు పాల్గొన్నారు.

సింగరేణి

మెడికల్ బోర్డు అన్‌ఫిట్ కోసం మోసగాళ్లను నమ్మకండి : సీఎండీ

శ్రీరాంపూర్, జనవరి 17 : సింగరేణిలో అనారోగ్య కారణాలతో విధి నిర్వాహణ చేయలేని ఉద్యోగుల కోసం సంస్థ నిర్వహించే మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని, ఎవరైనా మోసగాళ్లు డబ్బు తీసుకొని అన్‌ఫిట్ చేస్తామని ప్రలోభ పెడితే వాటిని నమ్మవద్దని సింగరేణి చైర్మన్ అండ్ ఎండీ ఎన్ బలరామ్ కోరారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులందరినీ సింగరేణి నిర్వహించే మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి అన్‌ఫిట్ చేస్తారని, వెంటనే కారుణ్య నియామకాలను చేపడతున్నామని తెలిపారు. ఇప్పటికే సుమారు 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మోసగాళ్ల మాటలను నమ్మవద్దని, అలాంటి వారి సమాచారం అందించాలని కోరారు.

రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, పీఎల్ఆర్ బోనస్, ఏరియర్స్..

శ్రీరాంపూర్, జనవరి 17 : సింగరేణి పదవీ విరమణ కార్మికులకు యాజమాన్యం 2022-23 సంస్థ లాభాల వాటా 32 శాతం, పీఎల్ఆర్ బోనస్ చెల్లించేందుకు ఆదేశాలు జారీ చేసిందని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య పేర్కొన్నారు. బుధవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న 2022-23లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు 32 శాతం లాభాల వాటా చెల్లిస్తారని చెప్పారు. పీఎల్ఆర్ బోనస్ ఈ నెల 21న చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. 11వ వేతన ఒప్పంద సవరణ ఏరియర్స్ 6 ఫిబ్రవరిలో చెల్లిస్తారని తెలిపారు. ఏఐటీయూసీ కొన్ని నెలలుగా కోలిండియా, సింగరేణి యాజమాన్యాన్ని కోరిన మేరకు చెల్లిస్తున్నట్లు తెలిపారు.

ఏఐటీయూసీ కృషితో రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా

కాసిపేట, జనవరి 17 : ఏఐటీయూసీ కృషితో సింగరేణి రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, పీఎల్ఆర్ బోనస్, వేజ్‌బోర్డ్ ఏరియర్స్ సాధించినట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ పేర్కొన్నారు.

కార్మికులకు ఉద్యోగోన్నతి లేఖలు



లేఖలు అందిస్తున్న డీవైజీఎం సంతోష్‌కుమార్

శ్రీరాంపూర్, జనవరి 17 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ 3గనిలో కార్మికులకు బుధవారం గని ఏజెంట్ గోపాలసింగ్, డీవైజీఎం సంతోష్‌కుమార్ ఉద్యోగోన్నతి లేఖలు అందించారు. గనిపై జరిగిన కార్యక్రమంలో ముందుగా ఉద్యోగోన్నతి పొందిన ఇస్లావత్ గోపాల్‌కు ఏజెంట్ ఉద్యోగోన్నతి సర్వీస్ లింక్‌డ్ ప్రమోషన్ లేఖ అందించారు. గనిలో 21 మందికి ఉద్యోగోన్నతి లభించినట్లు పేర్కొన్నారు. కార్మికులు ఉద్యోగోన్నతితో మరింత ఉత్సాహంగా, బాధ్యతగా పనిచేసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.